క్లుప్తంగా

పీవీ సేవలు చిరస్మరణీయం

ఉట్నూర్‌రూరల్‌: మాజీ ప్రధాని, దివంగత పీవీ నర్సింహరావు దేశంలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి ప్రగతిపథంలో నడిపేందుకు కృషిచేశారని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కొనియాడారు. శనివారం స్థానిక క్యాంప్‌ కార్యాలయంలో ఆయన జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

బల్దియా డీఈకి వీడ్కోలు



తిరుపతిని సన్మానిస్తున్న కమిషనర్‌ రాజు

కై లాస్‌నగర్‌: ఆదిలాబాద్‌ మున్సిపల్‌ డీఈగా పనిచేస్తూ ఇటీవల హైదరాబాద్‌లోని టీయూఎఫ్‌ఐడీసీ కార్యాలయానికి బదిలీపై వెళిన ఎం.తిరుపతికి బల్దియా అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం మున్సిపల్‌ కార్యాలయ సమావేశ మందిరంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూలమాల, శాలువలతో సత్కరించారు. కమిషనర్‌ సీవీఎన్‌. రాజు, ఎంఈ పేరి రాజు, డీఈ కార్తీక్‌, మేనేజర్‌ స్వామి, ఉద్యోగులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

బేల: అంగన్‌వాడీ కేంద్రాలు సమయపాలన పాటించాలని ఆదిలాబాద్‌ సీడీపీవో సురేఖ పేర్కొన్నారు. మండలంలోని మశాల(బి) గ్రామంలో సిర్సన్న క్లస్టర్‌ పరిధిలోని 26 అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లతో పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, విద్య, అవసరమైన సామగ్రిపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ రోజు అంగన్‌వాడీ కేంద్రాల్లో బెల్‌ కొట్టించాలన్నారు. సూపర్‌వైజర్‌ సుజాత పాల్గొన్నారు.

జర్నలిస్ట్‌ స్వేచ్ఛ ఆత్మహత్య బాధాకరం

బోథ్‌: జర్నలిస్ట్‌, ఉద్యమకారిణి వొటార్కర్‌ స్వేచ్ఛ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని ఎమ్మెల్యే అనిల్‌ జాదవ్‌ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమాన్ని ప్రజలకు మీడియా ద్వారా, కథనాల ద్వారా తెలియజేసిందని అన్నారు. ఆమె మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బోథ్‌ ప్రెస్‌క్లబ్‌ సభ్యులు శనివారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా, హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడిన జర్నలిస్ట్‌ స్వేచ్ఛ వొటార్కర్‌ది బోథ్‌ గ్రామమే. స్వేచ్ఛ వొటార్కర్‌ శంకర్‌, శ్రీదేవి కూతురు. చాలా కాలం క్రితం వారి కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది. తండ్రి శంకర్‌ అప్పుడప్పుడు బోథ్‌కు వచ్చి వెళ్తుండేవారు. బోథ్‌లో వారికి ఇల్లు ఉంది. ఆమె ఆత్మహత్యతో మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల పంపిణీ

నేరడిగొండ: మండల కేంద్రంలో శనివారం బోథ్‌ ఎమ్మెల్యే అనిల్‌ జాదవ్‌, కాంగ్రెస్‌ బోథ్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌ వేర్వేరుగా లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు పంపిణీ చేశారు. బోథ్‌కు చెందిన నారాయణశెట్టి సరితకు రూ.60వేలు, బజార్‌హత్నూర్‌ మండలం దేగామ గ్రామానికి చెందిన గడ్డె నారాయణకు రూ.20,500ల సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే అనిల్‌ జాదవ్‌ అందజేశారు. ఇచ్చోడకు చెందిన శ్రీజ సురకంటికి రూ.60 వేలు, బోథ్‌ మండలం సాయినగర్‌ కాలనీకి చెందిన సోనాభాయ్‌కు రూ.55వేల చెక్కులను కాంగ్రెస్‌ క్యాంప్‌ కార్యాలయంలో కాంగ్రెస్‌ బోథ్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌ అందజేశారు. ఇచ్చోడ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, బోథ్‌ మాజీ మండల అధ్యక్షుడు మహేందర్‌, యువజన నియోజకవర్గ అధ్యక్షుడు పోతారెడ్డి, కాంగ్రెస్‌ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, శేఖర్‌, రమేశ్‌యాదవ్‌, స్వామి, అశోక్‌, ఎండీ సద్దాం పాల్గొన్నారు.

ఉదారత చాటిన యువకుడు

జైనథ్‌: మూగజీవాల కోసం యువకుడు మందులు అందించి ఉదారత చాటుకున్నాడు. మండల కేంద్రానికి చెందిన బాధికర్‌ రాజు శనివారం రూ.10 వేలతో మందులు పంపిణీ చేసినట్లు పశు వైద్యాధికారి వినోద్‌ దేశ్‌పాండే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువైద్యశాలలో సరిపడా మందులు లేవన్నారు. దీంతో గ్రామస్తులు ముందుకొచ్చి సొంత డబ్బులతో మందులు అందించారని తెలిపారు. సొసైటీ సీఈవో గంగన్న, పంచాయితీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

'కార్పొరేట్‌ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి'

ఆదిలాబాద్‌: జిల్లా వ్యాప్తంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కార్పొరేట్‌ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్‌ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్‌ డిమాండ్‌ చేశారు. శనివారం డీఈఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. నాయకులు సచిన్‌, దిలీప్‌, ప్రవీణ్‌ ఉన్నారు.

కార్యదర్శులపై పనిభారం

- అన్ని శాఖల బాధ్యతలు వారిపై..
- అప్పులు చేసి అభివృద్ధి పనులు
- ఆర్థికభారంతో ఇబ్బందులు



తలమడుగు పంచాయతీ కార్యాలయం

తలమడుగు: గ్రామాల అభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు పనిభారంతో సతమతమవుతున్నారు. అన్ని శాఖల పనులు వీరే నిర్వహించాల్సిన పరిస్థితి. గత ప్రభుత్వం వీఆర్‌ఏ, వీఆర్వోల రద్దుతో పనుల భారమంతా వీరిపై పడింది. మండలంలో 29 పంచాయతీలకు 26 మంది కార్యదర్శులు ఉన్నారు. గత 16 నెలలుగా పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రావడం లేదు. సర్పంచుల పదవీకాలం ముగిసినప్పటి నుంచి రోజు వరకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. అప్పటి నుంచి పంచాయతీలకు రావల్సిన గ్రాంట్లు నిలిచిపోయాయి. కానీ పంచాయతీరాజ్‌ శాఖ ఉన్నతాధికారులు మాత్రం లక్ష్యాలు నిర్దేశిస్తూ గడువులోగా పనులు పూర్తి చేయాలని ఒత్తిడి చేస్తుండడంతో కార్యదర్శులు ఆర్థిక భారం, పని ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నారు.

ఇతర శాఖపనులు చేయాల్సిందే..

కార్యదర్శులు తమశాఖ రోజువారీ విధులతోపాటు ఇతర శాఖల పనులు చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, రాజీవ్‌ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక, మరుగుదొడ్లు, వ్యవసాయశాఖ, సర్వేలపై సైతం వారికి అప్పగించారు. వాటితోపాటు విద్యాశాఖకు సంబంధించి మరికొన్ని పనులు కట్టబెట్టారు. ఇప్పటికే మౌలిక వసతులు కల్పన పరిశుభ్రత, తదితర పనులు నిర్వహించాల్సి వస్తోంది. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌, సంబంధించిన విచారణ బాధ్యతలు వీఆర్వోలు నిర్వహించేవారు. ప్రస్తుతం ఆ వ్యవస్థ లేకపోవడంతో ఆ పనులు సైతం కార్యదర్శులపై మోపారు. గ్రామాల్లో వివాహాలను రిజిస్టర్‌ చేయడం, సంబంధిత ధ్రువపత్రాలు జారీ, వివాహం జరిగిన గ్రామం, ప్రదేశం తదితర అంశాలను విచారణ చేసి ధ్రువీకరించడం లాంటి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

అప్పులతో అభివృద్ధి పనులు

వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. పారిశుద్ధ్య పనులు చెప్పాల్సి ఉంది. గ్రామాల్లో ఇప్పటికే నిధుల్లేక కార్యదర్శులు అప్పులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఒక్కొక్కరు దాదాపు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు అప్పులు తీసుకువచ్చారు. ప్రభుత్వం పంచాయతీలకు కేటాయించిన ట్రాక్టర్లకు డీజిల్‌ పోయించడానికి నిధులు లేని పరిస్థితి ఉంది. అప్పులు చేసి పెట్రోల్‌బంక్‌లో ట్రాక్టర్లకు డీజిల్‌ పోసుకుని ట్రాక్టర్లను నడపాల్సిన పరిస్థితి నెలకొందని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పని భారం తగ్గించాలి

పంచాయతీరాజ్‌, ఇతర శాఖల పనులు నిర్వహిస్తున్నాం. పంచాయతీలకు సర్పంచులు లేక చాలా ఇబ్బందిగా ఉంది. ప్రతి పని కార్యదర్శులే చేయాల్సి వస్తోంది. ఆర్థికభారం అధికమవుతోంది. పనిభారం తగ్గించేలా ప్రభుత్వం పునరాలోచించాలి.

– వినోద్‌, పంచాయతీ కార్యదర్శి, కుమలపూర్‌

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్యే పాయల్‌ శంకర్‌



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయల్‌ శంకర్‌

జైనథ్‌: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని ఎమ్మెల్యే పాయల్‌ శంకర్‌ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శనివారం జైనథ్‌ ఉమ్మడి మండలాలు, బేల మండలానికి చెందిన 34 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు రెడ్‌గ్రామ్‌ విత్తన ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రభుత్వం తులం బంగారం ఇస్తానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. తహసీల్దార్లు రాజేశ్వ రి, విశ్వనాథ్‌, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ ఉల్లాస్‌, మార్కె ట్‌ కమిటీ చైర్మన్‌ అల్లూరి అశోక్‌రెడ్డి, మండల అధ్యక్షుడు లోకకరుణాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ప్రతాప్‌ యాదవ్‌, బీజేపీ నాయకులు రాకేశ్‌రెడ్డి, సామ రమేశ్‌రెడ్డి, విశాల్‌ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

ఆదిలాబాద్‌: నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్‌ శంకర్‌ పేర్కొన్నారు. పట్టణంలోని భాగ్యనగర్‌ కాలనీలో శనివారం శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి రూ . 4.20 లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్‌, దశరథ్‌, గంట సురేశ్‌, సురేశ్‌గౌడ్‌, గోవర్ధన్‌, సుధాకర్‌, డా. రమేశ్‌, కాలనీవాసులు పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి' వరం లాంటిది



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌

ఇచ్చోడ: పేదింటి ఆడపడుచులకు కల్యాణ లక్ష్మి పథకం వరంలాంటిదని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ అన్నారు. తహసీల్దార్‌ కార్యాలయంలో ఇచ్చోడ, సిరికొండ మండలాల 67 మంది లబ్ధిదారులకు శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్‌ ప్రభుత్వం అదనంగా తులం బంగారం ఇస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపించారు. ఇచ్చోడ, సిరికొండ తహసీల్దార్లు సత్యనారాయణరావు, తుకారాం, మార్కెట్‌ చైర్మన్‌ సత్యవతి కోటేశ్‌, బీఆర్‌ఎస్‌ మండల కన్వీనర్‌ కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సబ్సిడీ గడ్డి విత్తనాలు పంపిణీ

ఇచ్చోడ: మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ శనివారం సబ్సిడీ గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. ఏవో రమేశ్‌కుమార్‌, ఏఈవో సంజీవ్‌నాయక్‌ పాల్గొన్నారు.

చిత్రం గీసి..అభిమానాన్ని చాటి

బోథ్‌: మండల కేంద్రానికి చెందిన రుషి అనే విద్యార్థి బోథ్‌ ఎమ్మెల్యే అనిల్‌ జాదవ్‌ చిత్రాన్ని గీసి తన అభిమానాన్ని చాటాడు. శనివారం నేరడిగొండలో ఎమ్మెల్యేను కలిసి చిత్రాన్ని అందజేశారు. తన చిత్రాన్ని గీసిన విద్యార్థి రుషిని అభినందించారు.

హీరాసుక్క ఆశయాలు గొప్పవి

- ఎంపీ నగేశ్‌



ఎంపీ నగేశ్‌ను సన్మానిస్తున్న ప్రధాన్‌ సమాజ్‌ సభ్యులు

బజార్‌హత్నూర్‌: గోండిధర్మ గురువు హీరాసుక్క ఆశయాలు గొప్పవని ఎంపీ నగేశ్‌ తెలిపారు. మండలంలోని యేసాపూర్‌ గ్రామంలో హీరాసుక్క విగ్రహం ప్రతిష్ఠాపన సందర్భంగా మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీని సన్మానించారు. పీఏసీఎస్‌ చైర్మన్‌ వెంకన్న, ప్రధాన్‌ సమాజ్‌ సభ్యులు నగేశ్వర్‌, సుదర్శన్‌, గణేష్‌, రమణ, శంకర్‌, సుఖ్‌దేవ్‌ పాల్గొన్నారు. కాగా, మండలంలో 40 వేల జనాభాకు బజార్‌హత్నూర్‌, దేగామలో రెండు తెలంగాణ గ్రామీణ బ్యాంకులు ఉండటంతో ఖాతాదారులు, రైతులు ఇబ్బందుల దృష్ట్యా మరో బ్యాంకు ఏర్పాటుకు కృషి చేస్తానని ఎంపీ నగేశ్‌ తెలిపారు. మండల కేంద్రంలో రైతులు శనివారం ఎంపీని వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడుతానని తెలిపారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన అధ్యాపకుడు దగ్గరి వెంకటేశ్‌ ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స అనంతరం ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న ఎంపీ నగేశ్‌ గ్రామానికి చేరుకుని వెంకటేశ్‌ను పరామర్శించారు.

ఎంపీని కలిసిన చింతగూడ గ్రామస్తులు

బోథ్‌: ఎంపీ నగేశ్‌ను ఆదిలాబాద్‌లోని ఆయన నివాసంలో బోథ్‌ మండలం చింతగూడ గ్రామస్తులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, పరిష్కరిస్తానని ఎంపీ హామీ ఇచ్చారని తెలిపారు. అనంతరం ఎంపీని సన్మానించారు. మాజీ సర్పంచ్‌ లింగు, భీంరావ్‌ పటేల్‌, మాజీ ఎంపీటీసీ జుగాది రావ్‌, విజయ్‌ రామారావ్‌, భూమన్న, అమృత్‌రావ్‌ తదితరులు పాల్గొన్నారు.

పీవీటీజీ గిరిజనుల అభివృద్ధికి చర్యలు

నార్నూర్‌: ధర్తీ ఆబ, జన జాతీయగ్రామీణ ఉత్కర్ష అభియాన్‌ (జుగా) పథకాల ద్వారా పీవీటీజీ గిరిజనుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ అన్నారు. గాదిగూడ మండలం ఖడ్కి, సాంగ్వి గ్రామంలో శనివారం (జుగా) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం చేపట్టిన ప్రధానమంత్రి జన్‌మన్‌, జుగా పథకం ద్వారా పీవీటీజీ గిరిజనుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామన్నారు. గ్రామాల్లో ఇళ్లు, తాగునీరు, విద్యుత్‌, రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, మత్స్య సంపద, పశు సంపద, సెల్‌టవర్ల నిర్మాణం తదితర సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఖడ్కిలో మొబైల్‌ వాహనాల ద్వారా వైద్యసేవలు, రక్తపరీక్షలు నిర్వహించారు. సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌ ప్రమాదాలు జరగకుండా చూడాలి

నేరడిగొండ: విద్యుత్‌ ప్రమాదాలు జరగకుండా ప్రజలకు భద్రత కల్పించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్‌ జిల్లా వైస్‌ చైర్మన్‌ రాథోడ్‌ సందీప్‌ అన్నారు. మండలంలోని బోరిగాం బ్రిడ్జి సమీపంలో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్‌ తీగలను శనివారం పరిశీలించారు. అనంతరం విద్యుత్‌ శాఖ అసిస్టెంట్‌ ఇంజినీర్‌ నాగేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌ తీగలు సరిచేయాలని కోరారు. ఆయన వెంట రాథోడ్‌ గులాబ్‌ సింగ్‌, జాదవ్‌ ప్రవీణ్‌ ఉన్నారు.

అర్హులైన అర్చకులను ఎంపిక చేస్తాం



పరిశీలిస్తున్న చంద్రశేఖర్‌, విలాస్‌శర్మ

బేల: ఆలయాల్లో దూపదీప నైవేద్యం కోసం అర్హులైన అర్చకులను ఎంపిక చేస్తామని జిల్లా దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్‌ అధికారి చంద్రశేఖర్‌, ప్రధాన అర్చకుడు విలాస్‌శర్మ పేర్కొన్నారు. దేవదాయశాఖ కమిషనర్‌, సహాయ కమిషనర్‌ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని శ్రీరామాలయంతోపాటు డోప్టాల గ్రామంలో హనుమన్‌ ఆలయాన్ని శనివారం పరిశీలించారు. ఈ దఫాలో జిల్లాలో ఎంపికైన పలు ఆలయాలను పరిశీలించి, అర్హులైన 20మంది అర్చకులను ఎంపిక చేసి కమిషనర్‌కు నివేదిస్తామన్నారు. శ్రీరామాలయ కమిటీ చైర్మన్‌ ఓల్లఫ్‌వార్‌ దేవన్న, ప్రధాన కార్యదర్శి అనిల్‌ గుండవార్‌, కార్యదర్శులు మోహన్‌ మాన్కర్‌, కుంచంవార్‌ కిశోర్‌, సభ్యులు రవి, సాగర్‌, అశోక్‌, ఆకాశ్‌ పాల్గొన్నారు.

ప్రతిభావంతురాలికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న కలెక్టర్‌ రాజర్షి షా

కై లాస్‌నగర్‌: ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ కామన్‌ ఎంట్రెన్స్‌ (టీజీ పీఈసెట్‌) పరీక్షలో ప్రతిభ చాటి 12వ ర్యాంకు సాధించిన తలమడుగు మండల కేంద్రానికి చెందిన నీలగిరి సాయిమిత్ర అనే విద్యార్థిని కలెక్టర్‌ రాజర్షి షా శనివారం సన్మానించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. చదువుతోపాటు పాటు అన్ని రంగాల్లో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. ఉన్నత విద్యకు అవసరమైన తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థిని తండ్రి అశోక్‌, అడిషనల్‌ కలెక్టర్‌ శ్యామలాదేవి, మాజీ జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి, గోవర్ధన్‌ రెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి



విద్యార్థిని పాఠశాలలో చేర్పించిన సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్‌: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించేందుకు బాలల పరిరక్షణ సమితి కృషి చేస్తుందని చైల్డ్‌ లైన్‌ కోఆర్డినేటర్‌ సతీశ్‌కుమార్‌ అన్నారు. కలెక్టర్‌ ఆదేశాల మేరకు బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేలా ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా పట్టణంలోని గణేశ్‌ థియేటర్‌ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మార్కెట్‌లో అరటిపండ్లు, నిమ్మకాయ సోడా అమ్ముతున్న ఇద్దరు విద్యార్థులను శనివారం గుర్తించామన్నారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌ చేసి అనంతరం వారు మానేసిన పాఠశాలల్లోనే తిరిగి చేర్పించినట్లుగా తెలిపారు. కార్యక్రమంలో షూర్‌ ఎన్జీవో కోఆర్డినేటర్‌ వినోద్‌, అశ్విని పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

స్టేట్‌ ఫస్ట్‌ ర్యాంకర్‌కు సన్మానం



రుతికను సన్మానిస్తున్న ఆడె గజేందర్‌

బోథ్‌: ఐదేళ్ల లాసెట్‌ ప్రవేశపరీక్షలో రాష్ట్రంలోని మొదటి ర్యాంకు సాధించిన మండల కేంద్రానికి చెందిన ఎల్కాచి రుతికను శనివారం కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్‌, ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్‌, ప్రెస్‌ క్లబ్‌ అధ్యక్షుడు సూది నరేశ్‌ సన్మానించారు. శనివారం ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. స్థానిక విజ్ఞాన్‌ పాఠశాలలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరామర్శ

ఉట్నూర్‌రూరల్‌: మండల్ర కేంద్రానికి చెందిన కాంగ్రెస్‌ కార్యకర్త వాజిద్‌ తండ్రి ఇటీవల మృతిచెందాడు. మ్మెల్యే వెడ్మ బొజ్జు శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. నాయకులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఉట్నూర్‌రూరల్‌: క్రీడా పాఠశాలలో ప్రవేశాల కోసం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో ఉట్నూర్‌ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గణేశ్‌, శ్రీవేణి, శ్రావణి, హర్షిత, సంజయ్‌, కీర్తన, సమ్మేక్‌ ప్రతిభ కనబర్చారు. జూలై 1న హకీంపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు అధ్యాపకుడు రవి తెలిపారు. ఎంఈవో ఆశన్న వారిని అభినందించారు.

'దాడిని ఖండిస్తున్నాం'

బోథ్‌: ఓ టీవీ చానల్‌పై బీఆర్‌ఎస్‌ నాయకులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కాంగ్రెస్‌ జిల్లా అధికార ప్రతినిధి చంటి పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలు ఎత్తి చూపితే దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. దాడి చేసిన వారిని పోలీసులు వెంటనే అరెస్టు చేయాలన్నారు.

80 వారాలకు హనుమాన్‌ చాలీసా పారాయణం

బోథ్‌: సొనాల మండల కేంద్రంలోని రామాలయంలో హిందూ ధర్మ జాగరణ మండలి ఆధ్వర్యంలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న హనుమాన్‌ చాలీసా 80 వారాలకు చేరుకుంది. భక్తులు సాయంత్రం 7 గంటల నుంచి హనుమాన్‌ చాలీసా పారాయణాన్ని చదివారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, పారాయణాన్ని వందరోజుల పాటు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

ప్రిన్సిపాల్‌గా అనురాధ

బోథ్‌: మండల కేంద్రంలోని మోడల్‌ స్కూల్‌లో నూతన ప్రిన్సిపాల్‌గా శ్రీపతి అనురాధ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు శ్రీనివాస్‌ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించారు. అనురాధ..జనగాం జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు.

వీర జవాన్‌కు నివాళి

బేల: 2002, జూన్‌ 28న జమ్ము కశ్మీర్‌ కుప్‌వాడలో విధి నిర్వహణలో అమరుడైన వీర జవాను బిజేందర్‌కు మండలకేంద్రంలోని మార్కెట్‌ కూడలిలో శనివారం ఆయన చిత్రపటానికి ఎస్సై నాగనాథ్‌ పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్‌లు దేవన్న, తేజ్‌రావు, ఇంద్రశేఖర్‌, ఆయా పార్టీల నాయకులు, జవాన్‌ కుటుంబ సభ్యులు రాధేశ్యాం, రజనీ, అశోక్‌నగర్‌, కాలనీవాసులు ఉన్నారు.

'నిధులు మంజూరు చేశామనడం సరికాదు'

ఉట్నూర్‌రూరల్‌: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఉన్నతీకరణ కోసం బీఆర్‌ఎస్‌ హయాంలో రూ.13.75 కోట్ల నిధులు మంజూరైందని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు వచ్చి తామే మంజూరు చేశామని అనడం సరికాదని మాజీ ఎంపీపీ జైవంత్‌రావు, రాష్ట్ర నాయకుడు భరత్‌ చౌహాన్‌ అన్నారు. స్థానిక ప్రెస్‌భవన్‌లో శనివారం వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌లో మంజూరైన పనులను ప్రస్తుత కాంగ్రెస్‌.. మంత్రి శిలాఫలకం ఏర్పాటు చేసి ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. నాయకులు ముజీబ్‌, కరీం, మహేందర్‌, సనేరావు, సత్యన్న, వసంత్‌రావు, భూమన్న, లచ్చు, సాజిద్‌, సాయి, ఆశన్న, అంజిత్‌, జయచంద్ర పాల్గొన్నారు.

'ఉనికి కోసమే విమర్శలు'

నేరడిగొండ: బోథ్‌ ఎమ్మెల్యే కేవలం తన ఉనికిని కాపాడుకోవడానికి మాత్రమే సీఎం రేవంత్‌ రెడ్డి ప్రజాపాలనపై లేనిపోని విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌ అన్నారు. మండలంలోని తన క్యాంప్‌ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజలకు న్యాయంగా దక్కాల్సిన కుప్టి ప్రాజెక్టుకు నిధులు రాబట్టడంలో అప్పటి జెడ్పీటీసీ అనిల్‌ జాదవ్‌, నేతలు విఫలమయ్యారన్నారు. నేరడిగొండ మండలంలో ఒక్క డబుల్‌ బెడ్రూం ఇల్లు కట్టించలేదన్నారు. నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పైలట్‌ ప్రాజెక్టు ప్రజావాణికి స్పందన



దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌రూరల్‌: ఆదిలాబాద్‌ రూరల్‌ మండలం ఎంపీడీవో సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన పైలట్‌ ప్రాజెక్టు ప్రజావాణికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి పద్మ భూషన్‌రాజు మాట్లాడుతూ గతంలో ఎన్జీవోలు మండలంలోని గ్రామాలకు క్షేత్రస్థాయికి వెళ్లి ఫిర్యాదులు స్వీకరించేవారని తెలిపారు. అందులో భాగంగా ఎంపీడీవో సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి బహిరంగ విచారణ వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 242 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. గృహజ్యోతి సబ్సిడీ వర్తించడం లేదని, పీఎం కిసాన్‌ డబ్బులు జమకావడం లేదని, గ్యాస్‌ సబ్సిడీ రావడం లేదని, రేషన్‌కార్డు లేదని, తదితర వాటిపై దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిని పరిశీలన అనంతరం పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



పి.ప్రభాకర్‌

నార్నూర్‌: నార్నూర్‌ సర్కిల్‌ సీఐగా పి.ప్రభాకర్‌ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రహీం పాషా బదిలీపై రామగుండం కమిషనరేట్‌కు వెళ్లారు. ప్రభాకర్‌ బాధ్యతల అనంతరం మాట్లాడుతూ నార్నూర్‌, గాదిగూడ మండలాల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానన్నారు. ఆయన వెంట ఎస్సై అఖిల్‌, తదితరులు ఉన్నారు. కాగా, సీఐను మాజీ సర్పంచ్‌ బానోత్‌ గజానంద్‌ నాయక్‌ ఆధ్వర్యంలో గ్రామస్తులు మొక్కను అందజేసి శాలువా కప్పి సత్కరించారు. మాజీ జెడ్పీటీసీ బ్రీజులాల్‌, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు దేవురావు, దళిత రత్న అవార్డు గ్రహీతలు నర్సింగ్‌ మొరే, మహేందర్‌, మాజీ మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ షేక్‌ దాదే అలీ, సహకార సంఘం డైరెక్టర్‌ కాంతారావు, పెసా చట్టం కోఆర్డినేటర్‌ సికిందర్‌ రాథోడ్‌, ఆటో యూనియన్‌ అధ్యక్షుడు ఫెరోజ్‌ ఖాన్‌, బీఆర్‌ఎస్‌ మండల కార్యదర్శి సయ్యద్‌ ఖాసీమ్‌, నాయకుడు సుభాష్‌ రాథోడ్‌ ఉన్నారు.



ఎమ్మెల్యేకు మొక్క అందిస్తున్న సీఐ ప్రసాద్‌

ఉట్నూర్‌ సీఐగా మడావి ప్రసాద్‌..

ఉట్నూర్‌రూరల్‌: ఉట్నూర్‌ సీఐగా మడావి ప్రసాద్‌ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్‌కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం ప్రజలతో మమేకంగా ఉంటూ శాంతి భద్రతలను కాపాడాలని సీఐకి సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు పూర్తిచేయాలి

తాంసి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తిచేయాలని ఎంపీడీవో మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కప్పర్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పంచాయతీ కార్యదర్శి నరేశ్‌తో కలిసి శనివారం పరిశీలించారు. గ్రామంలో మొత్తం 37 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు ఎంపీడీవో తెలిపారు. మాజీ సర్పంచ్‌ సదానంద్‌, మాజీ ఎంపీటీసీ సంతోశ్‌, గ్రామస్తులు నారాయణ తదితరులు ఉన్నారు.

'నిర్మాణాలు అడ్డుకోవడం సరికాదు'

ఆదిలాబాద్‌టౌన్‌: నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తే అటవీ అధికారులు నిర్మాణాలను అడ్డుకోవడం సరికాదని యువజన కాంగ్రెస్‌ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా అటవీ అధికారి ప్రశాంత్‌ బాజీరావు పాటిల్‌ను అటవీ శాఖ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. బేల మండలంలోని పలు ఏజెన్సీ గ్రామాలలో ఇళ్ల నిర్మాణాలు జరుగకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని తెలిపారు. దీంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన పేద ప్రజలు గూడు సౌకర్యానికి దూరమవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. డీఎఫ్‌ఓ స్పందించి పర్మిషన్లు ఇచ్చేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్‌, యువజన కాంగ్రెస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు, నాయకులు ఉన్నారు.